## ప్రశ్న:

## "సంఘములన్నింటిలో క్రైస్తవులున్నారా?"

## జవాబు:

"సంఘములన్నింటిలో క్రైస్తవులున్నారు" అనేది జనాభిమానం పొందిన ప్రతిపాదన యైయుంది. ఆ ప్రతిపాదనయే బైబిలు ఉల్లేఖనం అయ్యుంటే, వివాదమంతటిని నిలిపి వేస్తుంది. అయితే, దోషరహితమైన దేవుని వాక్యము అలాటి ప్రతిపాదనను చేయలేదు, గనుక దోషానికి గురియయ్యే అవకాశమున్న మానవ మాట పరీక్షింపబడవలసియుంది (1 థెస్స. 5:21).

సంఘములన్నింటిలో క్రైస్తవులున్నారో లేదో పరీక్షించడానికి యిష్టపడకుండ నీ మనస్సును నీవు దృఢపరచుకొనియుంటే, నీ హృదయము దేవుని యెదుట సరియైనదని చెప్ప వీలుపడదు. దైవ ప్రేరేపితుడై ప్రసంగించిన స్తెఫను మాటలను విన్న కొందరు తాము నమ్మని కొన్ని ప్రతిపాదనలను చేసినట్టు దేవుని వాక్యము చెప్తుతోంది. ప్రసంగీకుడు ఏమి చెప్పాడో పరీక్షించడానికి ఆ ప్రజలు నిరాకరించి, అతనిని చూచి "పండ్లు కొరికారు." "అప్పుడు వారు పెద్ద కేకలు వేసి చెవులు మూసికొని యేకముగా అతని మీదపడి పట్టణపు వెలుపలికి అతనిని వెళ్లగొట్టి, రాళ్లురువ్వి చంపిరి ..." (అపొ. 7:54–58). వారి హృదయాలు సరిగా లేవు, దేవుని వాక్యాన్ని పఠించడానికి నీవు నిరాకరించినట్లయితే, నీ సంగతి కూడా అంతే.

దైవ ప్రేరేపితులైన ప్రసంగీకుల మాటలు విని నమ్మని మరియొక జనుల కూటమిని గూర్చి దేవుని వాక్యము మనకు తెలుపుతోంది, "... ఆసక్తితో వాక్యమును అంగీకరించి, పౌలును, సీలయు చెప్పిన సంగతులు అలాగున్నవో లేవో అని ప్రతి దినమును లేఖనములు పరిశోధించుచు వచ్చిరి" (అపొ. 17:11). వారి హృదయాలు సరిగా ఉన్నాయి.

"క్రైస్తవుడు" అనే పదం ఉపయోగించినప్పుడు మనం దేన్ని గూర్చి మాట్లాడుతున్నాం? "క్రైస్తవుడంటే ఒక మంచి వ్యక్తి"యని అనేక మంది బదులిస్తారు. "మా పొరుగు మనిషి ఏ సంఘంలో సభ్యురాలు కాకపోయినా, ఆమె ఒక మంచి వ్యక్తియని ఒకరు చెప్పవచ్చు. ఆమె రోగులకు సహాయం చేస్తుంది, ఈ ఊరిలో ఆమె యొక మంచి క్రైస్తవ స్త్రీయని కూడా చెప్పవచ్చు." సంఘాలన్నిటిలో క్రైస్తవులున్నారా? క్రైస్తవుడంటే ఒక వ్యక్తి దయగాను, సాధారణంగా యితరులను మంచిగా ఆలోచించే వ్యక్తియనేది తప్పక నీ భావమై యుంటుంది. "క్రైస్తవుడు" అనేదానికి యివ్వబడే ఆ నిర్వచనాన్నిబట్టి, క్రైస్తవులనబడేవారు అన్ని సంఘాల్లోను ఉన్నారు, సంఘాల వెలుపల ఉన్నారు, క్రీస్తును నమ్మని క్రైస్తవులు కూడా ఉన్నారు! దయగల, గొప్ప హృదయంగల మహమ్మదీయులు, బౌద్ధులు కూడా, ఆ నిర్వచనాన్ని అంగీకరించినప్పుడు, క్రైస్తవులే అవుతారు.

"క్రైస్తవుడంటే కేవలం మంచి వ్యక్తి మాత్రమే కాదు, క్రీస్తునందు కూడా అతడు విశ్వాసముంచువాడు" అని యితరులు చెప్పవచ్చు. క్రైస్తవుడనే దానికి నిర్వచనం అదై యున్నప్పుడు, అన్ని సంఘాలలో క్రైస్తవులున్నారా? "లేరు" అని మనం వెంటనే చెప్పాలి, ఎందుకంటే, యూనిటేరియన్ మరియు జ్యూయిస్ సంఘాలు క్రీస్తునందలి విశ్వాసాన్ని బోధించవు. అందువలన, ఒక మనిషి క్రైస్తవుడై యుండడానికి క్రీస్తునందు విశ్వాసం అవసరమైయుంటే, అప్పుడు యూనిటేరియన్‌లోగాని, జ్యూయిష్ సంఘంలోగాని, క్రైస్తవులు లేరు.

ఒకడు క్రైస్తవుడై యుండడానికి కేవలం క్రీస్తునందు విశ్వాసంకంటే ఎక్కువ కావలసి యున్నట్టు నీవు బైబిలును చదివి చూస్తే కనుగొంటావు. "క్రీస్తునందు విశ్వాసముంచిన వారికి దేవుని కుమారులయ్యే హక్కు ఉంటుంది." అంటే, క్రైస్తవులయ్యే హక్కు ఉంటుంది. కాని – వారు కేవలం నమ్మడంలో ఎంత కాలం ఉంటారో అంతకాలం వారు క్రైస్తవులు కారు (యోహాను 1:12; 12:42). వేలకొలది మంది ప్రభువైన యేసునందు విశ్వాసముంచి నట్టు బైబిలు చెప్తుతోంది (అపొ. 2:36–47), అయితే వారు రక్షింపబడని స్థితిలో నిలిచియున్నారు. మారుమనస్సు పొంది, బాప్తిస్మం పొందేవరకు వారు క్రైస్తవులు కానేరరు. విశ్వసించి, మారుమనస్సు పొంది, బాప్తిస్మం పొందినవారే రక్షింపబడిన దేవుని ప్రజలు; "క్రైస్తవులని" పిలువబడిన శిష్యులు వారే (అపొ. 11:26; 26:28; 1 పేతురు 4:16; యాకోబు 2:7ను చూడు). దేవునివలన దయచేయబడిన లేఖనాలు – విశ్వసించి, మారుమనస్సు పొంది, బాప్తిస్మం పొందిన వ్యక్తినే క్రైస్తవుడని రుజువు పరుస్తుండగా, సంఘాలన్నింటిలో క్రైస్తవులున్నారా?

విశ్వాసముంచకయే వేలకొలది జనులు ఏదోయొక సంఘంలోనికి వచ్చారు. ఉదాహరణకు పసిబిడ్డలు; తమ తల్లిదండ్రుల విశ్వాసంమీద వారు ఆ సంఘాల్లో ప్రవేశించారు. బైబిలు ప్రకారము వారు క్రైస్తవులా? వారు మారుమనస్సు లేకయే వచ్చారా, వారికి కనీసం కుడియెడమలు కూడా తెలియవు. వారు బైబిలు వర్ణించే క్రైస్తవులేనా? ముంచడం పొందడానికి బదులు వేలకొలది మంది చిలకరింపుద్వారా వచ్చారు (రోమా 6:4; కొలస్సీ. 2:12). క్రైస్తవులను గూర్చి దేవుడు తన వాక్యంలో పలికిన క్రైస్తవులేనా వారు? వేలకొలదిమంది ముంచడం పొందినా, క్రైస్తవులవ్వడానికిగాను వారు అలాగు చేయవలెనని బోధింపబడినవారు కారు ("పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి," అపొ. 2:38; "నీ పాపములను కడిగి వేసి కొనుము," అపొ. 22:16). వారు అంతకు ముందే క్రైస్తవులు గనుక బాప్తిస్మం పొందమని వారు చెప్పబడ్డారు. బాప్తిస్మం లేకుండగనే వారి పాపాలు కడిగివేయబడినట్టు వారు చెప్పబడ్డారు. క్రైస్తవులను గూర్చి దేవుని గ్రంథము మాట్లాడినట్టు వారు క్రైస్తవులేనా? వారు మంచివారు, నైతిక సూత్రాలు పాటించే జనులు. వారు యేసునందు విశ్వాస ముంచుతారు, ఆయన కొరకు కష్టించి పని చేస్తారు. అయినా, బైబిలు భావంలో వారు క్రైస్తవులేనా? బైబిలు భావనలో కాకపోతే మరే భావనలో? ఏది క్రైస్తవులను చేస్తుందనే ప్రభువు యొక్క వర్ణనను మార్చడానికి ఆ జనులకు అధికారం ఎక్కడనుండి వచ్చింది?

అపొ. 2:38కి విధేయులై, బైబిలు భావనలో క్రైస్తవులై కూడా, మత శాఖల్లో

చేరిపోయినవారున్నారు. వారు యింకా క్రైస్తవులుగానే ఉన్నారా? అవును, గాని వారు దోషంలోనికి వెళ్లారు. క్రైస్తవులు విభాగింపబడడం తప్పని దేవుడు మనకు సెలవిస్తున్నాడు (1 కొరింథీ. 1:10–13). వారు యింకా దేవుని ప్రజలే అయితే విపత్కరమైన దోషంలో ఉన్నారు.

క్రైస్తవులను గూర్చి బైబిలు వర్ణించినట్టి క్రైస్తవులున్నారు. అయినా, లేఖనాధికారం లేకుండ తమ సొంతంగా, వారి ఆరాధనలో గాయక సమూహాలకు ప్రత్యేకమైన దుస్తులు తొడిగి, వాయిద్య సంగీతాన్ని ఉపయోగిస్తారు. వారు క్రైస్తవులేనా? అవునుగాని వారు స్థానిక సంఘపు స్తుతిగానాన్ని (ఎఫెసీ. 5:19; హెబ్రీ. 13:15) ప్రదర్శనగా మార్చారు.

పైగా, క్రైస్తవులను గూర్చి బైబిలు వర్ణించిన విధంగా క్రైస్తవులున్నారుగాని, వారు నులువెచ్చనగా మారిపోయి, దీవెనకరమైన ఆయన పని విషయంలో లక్ష్యంలేని వారైయుంటారు. వారు క్రైస్తవులేనా? అవునుగాని – "నీ క్రియలను నేనెరుగుదును, నీవు చల్లగానైనను వెచ్చగానైనను లేవు; నీవు చల్లగానైనను వెచ్చగానైనను ఉండిన మేలు. నీవు వెచ్చగానైనను చల్లగానైనను ఉండక, నులివెచ్చనగా ఉన్నావు నేను నిన్ను నా నోటనుండి ఉమ్మివేయ నుద్దేశించుచున్నాను" అని ప్రభువు అంటారు (ప్రకటన 3:15, 16). నులివెచ్చని క్రైస్తవులు ప్రభువునందు వేదనపెట్టు వారైయుంటారు.

మూడు పరిస్థితులు లేఖనానుసారంగా తప్పైయుండి మన శ్రద్ధనుకోరతాయి. (1) క్రైస్తవులని బైబిలు వర్ణించే విధంగా సంఘ సభ్యులైనవారు తమ్మును తాము క్రైస్తవులుగా చేసికోవాలి. (2) క్రైస్తవులని బైబిలు వర్ణించే విధంగా క్రైస్తవులైనవారు, మానవ కల్పితములైన పారంపర్యాలను విసర్జించి బైబిలు యొక్క ఆరాధనా విధానానికి తిరిగిరావాలి. (3) క్రైస్తవులని బైబిలు వర్ణించే విధంగా క్రైస్తవులైన సంఘసభ్యులేగాని, వారు నులివెచ్చనలో తిరిగిపోయారు. అట్టివారు తమ మొదటి ప్రేమకు తిరిగి రావలసి యుంటుంది (ప్రకటన 2:4).

## దిగ్భ్రమ కలిగించు దేవుని కృప[1]

మానవ పాపము యొక్క భయంకరమైన యుద్ధము, నేరము, పేరాశ, ద్వేషము, స్వార్థపరత్వము అనే వాటిలో బయలుపరచబడుతోంది; అయితే, అత్యధికంగా అది కల్వరి సిలువలో చిత్రింపబడింది. దిగ్భ్రమ కలిగించే దేవుని కృప, ఆయన ఉచితమైన దయ, మన రక్షణ కొరకైయున్న ఏకైక నిరీక్షణ అర్హతలేని వారి పట్ల ఆయన కనికరమును చూపడానికి పాత్రులనుగా మనలను ఎంచినందుకు దేవునికి స్తోత్రములు! మనుష్యులందరికి రక్షణకరమైన దేవుని కృప ప్రత్యక్షమయ్యింది (తీతు 2:11). తన న్యాయమే చెల్లాలని దేవుడు కోరియున్నట్టయితే, మనలో ఎవడును రక్షింపబడడు.

లోకాన్ని సృజింపక ముందే మానవుని రక్షించడానికి సంకల్పించాడు. తన సంతతి ద్వారా లోకం దీవించబడుతుందని ఆయన అబ్రాహాముకు వాగ్దానం చేశాడు. ఈ దీవెనలను గూర్చిన వాగ్దానం క్రీస్తు సిలువయందు నెరవేర్చబడింది. మన పాపములు భరించువానిగాను, పాపపరిహారార్థబలిగాను దేవుని కుమారుడు రూపొందినవాడై మన పాపములకు శాంతికరమైయున్నాడు.

క్రీస్తు మన రక్షకుడనే విశ్వాసముతో అంగీకరించేదానిపైననే మనం కృప పొందడమనేది సంపూర్ణంగా ఆధారపడియుంది. ఈ విశ్వాసమనేది నమ్మికతోను, ధైర్యముతోను, ఆధారపడడంతోను, లోబరచుకొనడంతోను, విధేయతతోను కూడినదై యుంటుంది. ఇందులో మన మెరిట్ ఏమీ ఉండదు. మన ప్రభువు కోరిన దాని నంతటికిని విధేయులమై లోబరచుకోగలము, లోబరచుకోవాలి కూడా, పాపంనుండి మరలడం, క్రీస్తులోనికి బాప్తిస్మం పొందడం, ధర్మంతోను ప్రేమతోను యితరులను సంధించడం, సర్వలోకానికి సువార్తను ప్రకటించడం అనే విషయాలన్నిటిలో విధేయులై యుండాలి. మనం చేయగలిగినది ఏమైయున్నా, రక్షణలోని, ఏ భాగాన్ని మనం సంపాదించుకోలేము. "మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడి యున్నారు; ఇది మీవలన కలిగినది కాదు, దేవుని వరమే. అది క్రియలవలన కలిగినది కాదు గనుక ఎవడును అతిశయపడ వీలులేదు" (ఎఫెసీ. 2:8, 9).

సూచనలు

[1]Adapted from F.W. Mattox, "The Amazing Grace of God," *20th Century Christian* 14 (May 1952): 3-5.